

# ముంచిన మొంథా

## పాలమూరు, నారాయణపేట జిల్లాల్లో భారీ వర్షం

- నేల కొరిగిన వరి పంట
- మడుల్లో నీరు నిలవడంతో గింజలు మొలకెత్తే అవకాశం
- తడిసి నల్లగా మారిన పత్తి
- మిడ్జిల్, జడ్చర్లలలో 11 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదు
- నారాయణపేటలో మట్టి ఇల్లు కూలి మహిళకు గాయాలు
- భారీ వర్షాలతో పాఠశాలలకు సెలవు



నారాయణపేట మండలం సింగారం గ్రామంలో వరి చేనులో నిలిచిన వర్షపు నీటిని బయటికి పంపిస్తున్న రైతు

మహబూబ్‌నగర్/నారాయణపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దాంతో వరి, పత్తి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం 11 గంటల వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. భారీ వానలతో విద్యా సంస్థలకు సెలవు ప్రకటిస్తూ డీఈఓలు ఉత్తర్వులు జారీ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని రాజాపూర్, జడ్చర్ల, మిడ్జిల్ మండలాల్లో 10 సెంటీ మీటర్లకుపైగా వర్షం కురిసింది. రోజంతా కురిసిన వర్షానికి జన జీవనం స్తంభించింది. మహబూబ్‌నగర్ నగరంలోని ప్రధాన రహదారి నిర్మానుష్యంగా మారింది. ఫుట్‌పాత్ వ్యాపారులు వ్యాపారాలు మూసివేశారు. తుపాను ప్రభావం మరో రెండు రోజులు ఉండే అవకాశం ఉందని చెబుతుండటంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. మిడ్జిల్ మండలంలోని దుందుభీ వాగు పొంగిపొర్లుతుంది. మిడ్జిల్‌లో కుంట నిండి అలుగు పారి, ఆ నీరు జాతీయ రహదారిపైకి వస్తోంది. జడ్చర్ల-కోడ్గల్ ప్రధాన రహదారిపైకి వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది.

### పొంగుతున్న వాగులు

భారీ వర్షాలకు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. జిల్లాలోని దుందుభీ, పెద్దమ్మ, ఊకచెట్టు, కోయిలకొండ వాగులు జోరుగా ప్రవహిస్తున్నాయి. చెరువులు, కుంటలలోకి భారీగా వరదనీరు చేరుతోంది. ఇప్పటికే పలు చోట్ల కుంటలు, చెరువులు నిండి అలుగులు పారుతున్నాయి. మరో మూడు నాలుగు రోజుల్లో కోతకు సిద్ధంగా ఉన్న 70 శాతం పంట వర్షాలకు దెబ్బతింటోంది. గాలులు, వర్షానికి చాలా వరకు పంట నేలకొరిగింది.



ఇల్లు కూలి గాయపడిన మహిళను ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు పోలీస్ వాహనంలోకి ఎక్కిస్తున్న ఎస్ఐ

### నారాయణపేట జిల్లాలో

నారాయణపేట జిల్లాలో తుఫాన్ ప్రభావంతో వరి పంటకు నష్టం వాటిల్లింది. కోతకు సిద్ధమైన వరి నేల వాలగా, పత్తి నల్లగా మారింది. పత్తి తడిసి, జారి మట్టిలో కలుస్తోంది. లోతట్టు పొలాల్లో నీరు నిలిచింది. నారాయణపేట, ఊట్కూర్, కృష్ణ, మాగనూర్, మరికల్ తదితర మండలాల్లో వరి పంట నేల కొరిగింది. తుఫాన్ వల్ల పత్తి తేమ 20 రావడంతో సీసీఐ కొనడం లేదు. లింగంపల్లి, తిప్రాస్‌పల్లి కాటన్ మిల్లుల దగ్గర కొనుగోళ్లు నిలిపేయడంతో మిల్లుల ముందు రైతులు రాస్తారోకో చేశారు.

### వాయిదాపడ్డ ఎస్ఏ-1 పరీక్షలు

తుఫాన్ కారణంగా బుధవారం జరగాల్సిన ఎస్ఏ-1 పరీక్షలను వాయిదా వేశారు. కలెక్టర్ సూచన మేరకు మధ్యాహ్నం నుంచి పాఠశాలలకు సెలవు ఇచ్చారు. వాయిదా పడ్డ పరీక్షను నవంబరు 1న నిర్వహించాలని విద్యాశాఖాధికారి గోవిందరాజులు ఆదేశాలు జారీ చేశారు. గురువారం ఎస్ఏ-1 పరీక్ష ఇదివరకు ఉన్న టైంటేబుల్ ప్రకారం జరుగుతుందని పరీక్షల విభాగం జిల్లా అధికారి రాజేంద్రకుమార్ తెలిపారు.

### మట్టి మిద్దెకూలి మహిళకు గాయాలు

నారాయణపేట జిల్లా కేంద్రంలోని హాజీఖాన్‌పేటలో మంగళవారం రాత్రి మట్టిమిద్దె కూలడంతో చింతామణి ముఖభాగం బయట ఉండి, శరీరం మట్టిలో కూరుకుపోయింది. కూతురు సంజన కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు, ఎస్ఐ వెంకటేశ్వర్లు మట్టిని తొలగించారు. గాయబడ్డ చింతామణిని పోలీస్ వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించి, చికిత్స చేయించారు. మహిళను రక్షించడంలో కృషి చేసిన ఎస్ఐ వెంకటేశ్వర్లును కాలనీవాసులు అభినందించారు. సహాయక చర్యల్లో హాజీఖాన్‌పేట యువతతో పాటు కాంగ్రెస్ నాయకులు వెంకుగౌడ్, సతీష్‌గౌడ్, అజీమ్ పాల్గొన్నారు.



నర్వలో వర్షానికి తడిసి జారిపోతున్న పత్తి



కొత్తపల్లి మండలం ఎక్కమేడ్‌లో నేలకొరిగిన వరి పంటను చూపుతున్న రైతు



మిడ్జిల్ మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై నిలిచిన వర్షపు నీరు



నారాయణపేట మండలం సింగారం శివారులో నేలకొరిగిన వరి పంట



కొత్తపల్లి మండలం భూనీడు శివారులో వర్షానికి తడిసి జారిపోతున్న పత్తి

## పాలమూరుపై పట్టింపేది?



పాలమూరులో విలేకరులతో మాట్లాడుతున్న కవిత

- అండర్ గ్రౌండ్ డ్రైనేజీ చేపట్టడం కూడా సాధ్యం కావడం లేదా?
- జడ్చర్లలో వంద పడకల ఆస్పత్రిని 50 పడకలకు ఎందుకు కుదించారు
- ప్రజాధనం వృథా చేస్తూ కురుమూర్తి వద్ద రోడ్డు పనులు చేస్తున్నారు
- మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే కాంగ్రెస్‌లో ఉన్నారా?.. బీజేపీలో ఉన్నారా?
- ఆల్మట్టి ఎత్తు పెంచితే పాలమూరు రిజర్వాయర్లలో క్రికెట్ ఆడుకోవాలి
- విలేకరుల సమావేశంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

మహబూబ్‌నగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పాలమూరు బిడ్డను అని పదేపదే చెప్పుకునే సీఎం రేవంత్‌రెడ్డి.. ఈ జిల్లా అభివృద్ధిపై పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. పురాతనమైన పాలమూరు పట్టణంలో ఇప్పటివరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లేదని, తాను ప్రాతినిధ్యం వహించిన నిజామాబాద్‌లో పదేళ్ల క్రితమే అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేశామని అన్నారు. జాగృతి జనంబాట కార్యక్రమంలో భాగంగా కవిత బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో మేధావుల సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఉద్యమ సంస్థగా ప్రారంభమైన జాగృతి ప్రస్థానం సమస్యల పరిష్కారం ఎజెండాగా, ప్రజా పోరాట పంథా మార్గంలో పయనిస్తుందని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్లలో గత ప్రభుత్వం వంద పడకల ఆస్పత్రిని నిర్మిస్తే దాన్ని 50 పడకలకు కుదించారని ఆరోపించారు. ఆ ఆస్పత్రిలో వైద్యం

(మిగతా 6లో..)

## అంతా మా ఇష్టం!

- నిబంధనలకు విరుద్ధంగా అక్రమ డిప్యుటేషన్లు
- మెడికల్ గ్రౌండ్స్ పేరుతో ఉపాధ్యాయుల తప్పుడు సమాచారం
- విద్యాశాఖలో నిబంధనలు పాటించని పరిస్థితి..

7

## మత్స్యకారుల అభివృద్ధికి కృషి

- మంత్రి వాకిటి శ్రీహరి
- ఎమ్మెల్యే జీఎంఆర్‌తో కలిసి కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో చేప పిల్లలు విడుదల



కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో చేప పిల్లలను విడుదల చేస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర క్రీడా, మత్స్య, పాడి పరిశ్రమ శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం దేవరకద్ర మండలం కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డితో కలిసి చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి, ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం మత్స్యకారలను పట్టించుకోలేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వారికి పూర్తిగా అండగా ఉంటుందన్నారు. పూర్తి రాయితీతో కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో 82 మిల్లీ మీటర్ల సైజు ఉన్న 2.50 లక్షల చేప పిల్లలను వదిలినట్లు తెలిపారు. దీంతో మత్స్యకారులు అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుందన్నారు. మక్తల్, నారాయణపేట, దేవరకద్ర నియోజకవర్గాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తానన్నారు. ఎమ్మెల్యే, తాను దేవరకద్ర, మక్తల్ నియోజకవర్గాలను సమదృష్టితో చూస్తామన్ని తెలిపారు. అనంతరం నార్లోనికుంట గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. దేవరకద్ర మునిసిపాలిటీ వార్డులు బల్సుపల్లి, గోప్లాపూర్, మీన్గోనిపల్లిలో పార్కులకు, దేవరకద్ర మునిసిపాలిటీలో రూ.3 కోట్లతో సీసీరోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇందిరమ్మ నమూన ఇంటిని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని మండల కేంద్రాల్లో మినీ స్టేడియాలు, మూడు మునిసిపాలిటీల్లో చేపల మార్కెట్‌లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మంత్రిని కోరారు. కార్యక్రమంలో కలెక్టర్ విజయేందిర బోయి, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి, మునిసిపల్ కమిషనర్ నరేశ్‌బాబు, అధికారులు, మండల నాయకులు పాల్గొన్నారు.

## యన్మన్‌గండ్లలో పెద్దపులి సంచారం

- పశువుల కాపరికి కనిపించిన వన్యప్రాణి
- నేడు ఆనవాళ్లు సేకరిస్తామన్న అటవీశాఖ అధికారి

నవాబ్‌పేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నవాబ్‌పేట మండలం యన్మన్‌గండ్ల గ్రామ సమీపంలోని బుధవారం పెద్దపులి కనిపించింది. గ్రామ దేవరగుట్ట వద్ద గల కోపిరాల గుండ్ల వద్ద ఉన్న చెక్‌డ్యాం సమీపంలో సాయంత్రం 5 గంటల ప్రాంతంలో రైతు చెలిమె అంజయ్య పశువులను మేపుతుండగా కుక్కలు అరిచాయి. దాంతో రైతు కొద్దిగా ముందుకెళ్లి చూశాడు. అక్కడ పెద్దపులి కనిపించడంతో వెంటనే పశువులను తోలుకుని, ఇంటికి వచ్చాడు. గ్రామస్థులకు విషయం చెప్పాడు. అటవీ శాఖ అధికారి వెంకటేష్‌కు సమాచారం ఇవ్వగా గురువారం ఉదయం అక్కడికి చేరుకుని ఆనవాళ్లు సేకరిస్తామని తెలిపారు.

## పత్తి కొనుగోలు నిలిపివేతతో రైతుల ఆగ్రహం

- పేట-మక్తల్ ప్రధాన రోడ్డుపై ట్రాక్టర్లను అడ్డంపెట్టి రాస్తారోకో 6
- మూడు గంటల పాటు రాకపోకలకు అంతరాయం

## అమరుల కుటుంబాలకు అండగా ఉండాలి

- మక్తల్ సీఐ రాంలాల్
- మక్తల్, కృష్ణలో కొవ్వొత్తులతో ర్యాలీ



మక్తల్‌లో పోలీస్ అమరవీరులకు కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న సీఐ రాంలాల్, పోలీసులు

మక్తల్/కృష్ణ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వాహణలో అమరులైన పోలీసుల కుటుంబాలకు ప్రతీ ఒక్కరు అండగా నిలవాలని మక్తల్ సీఐ రాంలాల్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం నారాయణపేట జిల్లా మక్తల్, కృష్ణ మండల కేంద్రాల్లో పోలీసులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. మక్తల్‌లో పోలీస్ స్టేషన్ నుంచి అంబేడ్కర్ కూడలి వరకు పోలీసులు, సిబ్బంది ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ రాంలాల్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలు అందిస్తారన్నారు. నిరంతరం ప్రజల ప్రాణాలు, ఆస్తుల పరిరక్షణ కోసం పనిచేస్తున్న పోలీసుల సేవలను ప్రశంసించారు. ఎక్కడైనా అరాచకం, అసాంఘిక కార్యకలాపాలు కొనసాగితే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రేవతి, చంద్రశేఖర్, శ్రీకాంత్, ఆశిరెడ్డి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

- కృష్ణ మండల కేంద్రంలో ఎస్ఐ నవీన్ ఆధ్వర్యంలో పోలీసులు, గ్రామస్థులు కొవ్వొతులతో ర్యాలీ నిర్వహించారు. పోలీస్ అమర వీరులకు నివాళి అర్పించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్


## మాతృ మరణాలు తగ్గించాలి

- నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లాలో మాతృ మరణాల సంఖ్యను తగ్గించేందుకు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, వైద్యులు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో జరిగిన మాతృ మరణాల సమీక్ష సమావేశానికి కలెక్టర్ అధ్యక్షతన వహించారు. జిల్లాలోని గుండుమాల్, దామరగిద్ద, కోటకొండ, ధన్వాడ, నారాయణపేట అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో సంభవించిన 8 మాతృ మరణాల గురించి ఆయా కేంద్రాల వైద్యాధికారులు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ మరణాలపై వివరణ ఇవ్వాలని కోరారు. మాతృ మరణాల సంఖ్యను తగ్గించేందుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై వైద్యాధికారులతో చర్చించారు. ఇక ముందు మాతృ మరణాల నివారణకు అవసరమైన ముందస్తు చర్యలు తీసుకునేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గర్భిణుల ఆరోగ్యంపై ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, వైద్యులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రతీ మూడు నెలలకు సమావేశం నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జయచంద్ర మోహన్, జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ మల్లికార్జున్, ఐఎంఏ జిల్లా చైర్మన్ డాక్టర్ మల్లికార్జున్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శైలజ, పీవో ఎంహెచ్ఎన్ డాక్టర్ సుదేష్ణ, డీజీవో హెచ్‌వోడీ డాక్టర్ అమిత కుమారి, మత్తు డాక్టర్ తేజశ్విని, జీఎంపీహెచ్ఈవో గోవింద రాజు, సూపర్‌వైజర్ నర్మద తదితరులు పాల్గొన్నారు.

## కష్టేఫలి!

- స్వయంకృషితో ఎదుగుతున్న మహిళలు
- జ్యూట్‌బ్యాగ్‌ల తయారీతో ఉపాధి 6
- నేడు ప్రపంచ పొదుపు దినోత్సవం



ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా చికెన్ సెంటర్స్ అసోసియేషన్

**నేటి చికెన్ ధరలు**

| | |
|---|---|
| ఫామ్ లైవ్ | : 130.00 |
| హోల్ సేల్ | : 139.00 |
| డ్రెస్డ్ | : 234.00 |
| స్కిన్ లెస్ | : 251.00 |

## వర్షంలోనే దాసంగాలు

- తుఫాన్ ప్రభావంతో భక్తుల ఇక్కట్లు



వర్షానికి ట్రాక్టర్‌లకు టార్పాలిన్ కవర్లు కట్టుకుని వాటి కింద ఉన్న భక్తులు



టార్పాలిన్ కవర్ల కిందే దాసంగాలు తయారు చేస్తున్న భక్తులు

చిన్నచింతకుంట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్ గ్రామ సమీపంలో వెలిసిన కురుమూర్తి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా భక్తులు బుధవారం వర్షంలోనే దాసంగాలు పెట్టారు. మంగళవారం ఉద్దాలోత్సవం ముగిసిన తరువాత అర్ధరాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం పడటంతో జాతర మైదానం బురదగా మారింది. రోజంతా వర్షం కురవడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. ఉద్దాలోత్సవానికి మంగళవారం వచ్చిన భక్తులు రాత్రి అక్కడే ఉన్నారు. ఉదయం కోనేరులో స్నానాలు చేసి, వాహనాలకు టార్పాలిన్ కవర్లు కట్టుకుని వాటి కింద దాసంగాలు సమర్పించారు. వర్షానికి కట్టెలు మండక ఇబ్బందులు పడ్డారు. జాతర ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. స్వామి దర్శనం కోసం వర్షంలోనూ మైదానంతో పాటు రాజగోపురం నుంచి స్వామి వారి గర్భగుడి వరకు భక్తులు బారులు తీరారు. దుకాణాల వద్ద సందడి నెలకొంది.



వర్షంలోనే నీటిని తెచ్చుకుంటున్న భక్తులు



వర్షానికి బురదగా మారిన జాతర మైదానం

# పాలమూరుపై పట్టింపేది?

( 5వ పేజీ తరువాయి )

అందకపోవడంతో పురుగుల మందు తాగిన యువ రైతు ప్రాణాలు కోల్పోయాడని విమర్శించారు. గతంలో జడ్చర్ల ఆస్పత్రిలో జనరేటర్ పని చేయకపోతే సీఎం రేవంత్‌రెడ్డి అప్పటి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని కట్టేస్తే కరెంటు వస్తుందని అన్నారని, మరి ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డిని కట్టేస్తే పాలమూరు జిల్లా అభివృద్ధి చెందుతుందని అన్నారు. గతంలో కురుమూర్తి దేవస్థానం వద్ద ఒక రోడ్డు వేశారని, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి వేయించిన రోడ్డుపై తాను తిరగనని.. ప్రస్తుత ఎమ్మెల్యే మరో రోడ్డు వేయిస్తూ ప్రజాధనం వృథా చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఖాళీగా ఉన్న ఖజానాను నింపుతామని చెప్పి.. ప్రస్తుతం రెండున్నర లక్షల కోట్ల రూపాయల అప్పులు తెచ్చారన్నారు. కానీ బీజేపీలో, కాంగ్రెస్‌లో ఏ పార్టీలో ఉన్నారో తెలియని పాలమూరు ఎమ్మెల్యే తమకు నిధులు ఇవ్వకపోవడంతో గ్రామాల్లో తిరగలేకపోతున్నామని అంటున్నారని గుర్తు చేశారు. జడ్చర్ల ఎమ్మెల్యే తనను గెలిపించిన 24 గంటల్లో కొల్లూరును మండలం చేస్తామని ప్రకటించారని, కానీ చేయలేదన్నారు. సెజ్ విషయంలో పీసీబీ అధికారులు దాడులు చేస్తారని తెలిసి.. ముందే హడావిడి చేస్తూ.. సీఎంనే తిడుతుంటారని అన్నారు.

**పాలమూరు-రంగారెడ్డిని పూర్తి చేయాలి**

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో 80 శాతం పనులు పూర్తయ్యాయని, 20 శాతం లింకేజీ పనులు మాత్రమే ఉన్నాయని అన్నారు. కేసీఆర్‌కు పేరొస్తుందని పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేయకపోతే.. చంద్రబాబు పోతిరెడ్డిపాడు ద్వారా కృష్ణా నీటిని, బనకచర్ల ద్వారా గోదావరి నీటిని తరలించుకుపోతారని అన్నారు. కర్ణాటకలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆలమట్టి ఎత్తు పెంచితే.. పాలమూరు రిజర్వాయర్లలో క్రికెట్ ఆడుకోవాల్సి ఉంటుందన్నారు. భారీ వర్షాలు కురవకపోతే దిగువకు చుక్కనీరు రాదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకం చేపట్టుకోవచ్చని, కానీ అదే సమయంలో పాలమూరు- రంగారెడ్డి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రస్తుత ప్రభుత్వం విద్య, వైద్యం విషయంలో అసలు పట్టింపు లేనట్లుగా వ్యవహరిస్తోందని, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో 30వ తేదీ నుంచి కాలేజీలు బంద్ చేస్తారని అంటున్నారన్నారు. అలాగే తెలంగాణ మైనారిటీ గురుకులాలకు 13 నెలలుగా అద్దె అందడం లేదని గుర్తుచేశారు. 75 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో ముస్లింలు, లాంబాడాలు లేని మొదటి కేబినెట్ ఇదేనని విమర్శించారు. తండాలను గ్రామ పంచాయితీలుగా మార్చుకున్నప్పటికీ.. ఇప్పటికీ భవనాలు, అంగన్‌వాడీలు, పాఠశాలలు లేవని అన్నారు. ప్రాణాలకు తెగించి తెచ్చుకున్న తెలంగాణను తెర్లు కానివ్వబోమని స్పష్టం చేశారు.

**కొత్తపేటలో కవిత జనంబాట**

హన్వాడ/మహబూబ్‌నగర్ అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : హన్వాడ మండలంలోని కొత్తపేట గ్రామంలో బుధవారం రాత్రి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జనంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ర్యాలీగా వెళ్లి ప్రజలను పలకరించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. దుకాణదారులతో మాట్లాడి దుకాణంలో వస్తువులు కొన్నారు. జాగృతి సభ్యులు పాల్గొన్నారు.

**షాసాబ్‌గుట్ట దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు**



దర్గాలో మతపెద్దలతో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బుధవారం మహబూబ్‌నగర్‌లోని షాషాబ్‌గుట్టలో గల హజ్రత్ సయ్యద్ మర్దాన్ అలీ ఖాద్రీ దర్గాను సందర్శించి చాదర్ సమర్పించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గా పీఠాధిపతి సయ్యద్ రజాక్ షా ఖాద్రీ, నాయకులు మోసీన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## నవంబరులో రైల్వేస్టేషన్ ప్రారంభం

- పనులను పరిశీలించిన ఏడీఆర్ఎం రామారావు




జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర రైల్వేహాల్ట్ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఏడీఆర్ఎం రామారావు

అలంపూరుచౌరస్తా, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర రైల్వేహాల్ట్ అభివృద్ధి పనులు పూర్తి కావొచ్చాయని దక్షిణమధ్య రైల్వే ఏడీఆర్ ఎం రామారావు తెలిపారు. బుధవారం ఆయన మరికొంతమంది అధికారులతో కలిసి జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర రైల్వేహాల్ట్ అభివృద్ధి పనులను పరిశీలించా రు. పనుల నాణ్యతపై కాంట్రాక్టరును ప్రశ్నించారు. పనుల్లో నాణ్యత లోపిస్తే బి ల్లులు ఆపేస్తామని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రయాణికులు కూర్చునేందుకు శా శ్వత కుర్చీలు ఏర్పాటు ఎందుకు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైలు ని లిచే స్థలం వరకు షెల్టర్లు కూడా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వచ్చే నెల మొదటివారంలో రైల్వే శాఖ మంత్రి చేత వర్చువల్‌గా ప్రారంభించనున్నట్లు తెలి పారు. ఆ లోపు మిగిలిన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టరును ఆదేశించారు. ఆయన వెంట సీనియర్ డీఎస్‌వో కె.విజయ్‌కుమార్, సీనియర్ డీఈఈ కె.శ్రీనివా స్, సీనియర్ డీఈఈ హేమానాయక్, డిప్యూటీ సీఈఈ సంజీవరావు, ఏసీఎం గోవిందు తదితరులు ఉన్నారు.

## సాంకేతిక సహాయకుల సమస్యలు పరిష్కరించాలి

- డీఆర్‌డీవో చిన్నఓబులేష్‌కు వినతిపత్రం అందజేత



నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో డీఆర్‌డీవో చిన్నఓబులేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లు

నాగర్‌కర్నూల్ టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సాంకేతిక సహాయకులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం డీఆర్‌డీవో చిన్నఓబులేష్‌కు వినతిపత్రం అందజేశారు. సాంకేతిక సహాయకులకు ప్రతీ నెల సకాలంలో జీతాలు అందకపోగా పనిభారంతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఉపాధి హామీ పనులకు సంబంధించిన రికార్డులను గ్రామ పంచాయతీలే చూసుకునేలా చూడాలని, సాంకేతిక పరంగా చేయవలసిన పనులు ఎక్కువగా ఉండడం వల్ల ప్రతీ టీఏకు లాప్‌టాప్‌లు అందజేయాలని, ప్రతి నెల 2న జీతాలు చెల్లించేలా చూడాలని వారు కోరారు. కార్యక్రమంలో సాంకేతిక సహాయకులు బాలయ్య, శ్రీనివాస్, మహేందర్, రఫీక్ పాల్గొన్నారు.

# కష్టేఫలి..!

- స్వయంకృషితో ఎదుగుతున్న మహిళలు
- జ్యూట్‌బ్యాగ్‌ల తయారీతో ఉపాధి
- నేడు ప్రపంచ పొదుపు దినోత్సవం



ఈమధ్య జిల్లాకు గవర్నర్ వచ్చిన సందర్భంగా కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన స్టాల్‌లో నాగజ్యోతి, మెప్మా పీడీ బృందం

పాలమూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రమను నమ్ముకుంటే ఎవరైనా సరే ఎంతోకొంత ఫలితం పొందుతారు. అలాంటి కోవలోనే ఓ మహిళ తను నమ్ముకున్న ఉపాధితో నెలకు కొంత డబ్బు సంపాదిస్తూ కుటుంబానికి చేదోడువాదోడుగా నిలుస్తోంది. మహబూబ్‌నగర్ పట్టణంలోని వెంకట మహాలక్ష్మి మహిళా సంఘం సభ్యురాలు నాగజ్యోతి స్వయం కృషితో ముందుకు సాగుతోంది. బ్యాంకు నుంచి రుణం తీసుకుని కష్టించి పనిచేసి తాము తయారు చేసిన బ్యాగులను అమ్మి రుణాన్ని తిరిగి చెల్లించి... మరోసారి రుణం తీసుకుంటోంది. ఇతర మహిళా సంఘాలకు ఆదర్శంగా నిలుస్తూ నెలకు రూ.30వేల ఆదాయం పొందుతోంది. ఈనెల 30న ప్రపంచ పొదుపు దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.



నాగజ్యోతి తయారు చేసిన జూట్‌బ్యాగులను పరిశీలిస్తున్న మెప్మా పీడీ ఎండీ యూసుఫ్

**నెలకు రూ.200లు పొదుపు..**

మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటైన వెంకటమహాలక్ష్మి మహిళా సంఘం. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోనిది. మొత్తం పదిమంది సభ్యులు ఉన్నారు. 2013 నుంచి ప్రతినెలా రూ.50లు పొదుపు చేయటం, 2025 నుంచి నెలా నెలా రూ.200 పొదుపు చేస్తున్నారు. ఈ పొదుపు చేస్తున్న డబ్బును సంఘంలోని సభ్యులు ఎవరైన తక్కువ వడ్డీకి రుణం తీసుకుని సంఘానికే చెల్లించాలి. పొదుపు చేసిన డబ్బు అదేవిధంగా వృద్ధి అవుతుంటుంది. మరొకవైపునుంచి స్త్రీనిధి, ఇతర రకాల బ్యాంకు రుణాలు తీసుకుంటారు. కొన్ని రుణాలు పావలా వడ్డీ, మరికొన్ని రూపాయి, మరొకటి రూపాయి పావలా వడ్డీకి తీసుకుంటారు. ఇలాంటి డబ్బుతో ఉపాధి బాట ఎంచుకుంటారు.

**కొద్దిపాటి రుణంతో ఉపాధి**

రుణం పొందిన మొదటిసారి కొత్తగా ఒక్క మిషన్ మాత్రమే కొని జూట్‌బ్యాగ్‌లు కుట్టి అమ్మటం ప్రారంభించింది. 2013లో బ్యాంకునుంచి మొదటిసారి రూ.50వేలు రుణం తీసుకుని జూట్‌బ్యాగ్‌లు తయారు చేయటం ప్రారంభించారు. తయారుచేసిన వాటిని రెగ్యులర్‌గా అమ్మటం, వినియోగదారులకు అవసరమైన ఆకృతిలో తయారు చేయటం ప్రత్యేకత. అందుబాటులో ఉండే ధర, నాణ్యమైన జూట్‌బ్యాగ్‌లు తయారు చేసి మహిళలు, ప్రజలనుంచి మన్ననలు ప్రారంభమైనవి. దాంతో రుణం తిరిగి చెల్లించి 2015లో రూ.లక్ష రుణం పొందింది. రెండోసారి రుణం పొందిన ఉత్సాహంతో పనిచేస్తూ నెలకు ఇంత ఆదాయం వచ్చే విధంగా ప్రణాళిక రూపొందించి అమలు చేటయం ప్రారంభించారు. ఆ రుణం చెల్లించటంతో 2024లో ఏకంగా రూ.లక్షా 50వేల రుణం పొందటం విశేషం. దాంతో పాటు రుణం సకాలంలో చెల్లించటం, మంచి అనుభవం, నిబద్ధతను గమనించి స్త్రీనిధి నుంచి 2021లో రూ.50వేల రుణం అందజేసి ప్రోత్సహించారు.

**నెలకు రూ.30వేల వేతనం**

నాగజ్యోతి పేరుతో జూట్‌బ్యాగ్ పేరుతో వ్యాపారం ప్రారంభించి హోల్‌సేల్, రిటైల్‌లో బ్యాగులు అమ్మటంతో నెలకు రూ.20-30వేల వరకు ఆదాయం పొందటం ప్రత్యేకత. నాతో పాటు మరికొంత మంది మహిళలకు ఉపాధి కల్పిస్తోంది నాగజ్యోతి.

**స్వశక్తితో ఎదిగా..**



వివాహాలు, ఇతర శుభకార్యాలకు రిటన్‌గిఫ్ట్‌గా ఇచ్చేందుకు ప్రోత్సహిస్తాను. నాతో పాటు కొందరు మహిళలు నా దగ్గర పీజు వర్క్ చేసుకుంటారు. ఒకటి కుడితే ఇంత అని ఇవ్వటంతో ఎవరు ఎన్ని కుట్టుకుంటే అంత డబ్బు వస్తుండటంతో ఆరుగురు మహిళలు ఉపాధి పొందుతున్నారు.

**- నాగజ్యోతి,**
**వెంకటమహాలక్ష్మి సంఘం సభ్యురాలు**

## పత్తి కొనుగోలు నిలిపివేతతో రైతుల ఆగ్రహం

- పేట-మక్తల్ ప్రధానరోడ్డుపై ట్రాక్టర్లను అడ్డంపెట్టి బైఠాయింపు
- మూడు గంటల పాటు రాకపోకలకు అంతరాయం

ఊట్కూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సీసీఐ కొనుగోలు కేంద్రంలో అమ్మడానికి స్లాట్ బుక్ చేసుకున్న రైతులకు చుక్కెదురైంది. నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలం త్రిపస్పల్లి గ్రామ పరిధిలోని విజయ్ కాటన్ ఇండస్ట్రీస్ మిల్లు వద్ద అమ్మడానికి ఒక రోజు ముందు నుంచే క్యూ కట్టిన రైతులకు వర్షాల కారణంగా తేమ శాతం పెరుగుతున్నదని సీసీఐ అధికారులు బుధవారం కొనుగోలు నిలిపి వేశారు. దీంతో ఆగ్రహించిన రైతులు అధికారులతో వాదనకు దిగారు. అయినా ఒప్పుకోకపోవడంతో రైతులందరు మక్తల్-నారాయణపేట ప్రధాన రోడ్డుపై బైఠాయించి, రాస్తారోకో నిర్వహించారు. రోడ్డుకు అడ్డంగా ట్రా క్టర్లను పెట్టి రైతులు ప్రభుత్వానికి వ్యతిరే కంగా నినాదాలు చే శారు. తేమ శాతం అధికంగా ఉన్న పత్తి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మూడు గంటల పాటు రైతులు బైఠాయించడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. మక్తల్ సీఐ రాంలాల్, ఊట్కూర్ ఎస్ ఐ రమేష్ రైతులతో మాట్లాడి ఆందోళన విరమించేందుకు ప్రయత్నించారు. స్లాట్ బుక్ చేసుకొని ఒక రోజు ముందు వస్తే ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అధికారులు కొనుగొలు నిలిపివేస్తే మా పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. పత్తి కొనుగోలు చేసే వరకు ఆందోళన విరమించేది లేదని రైతులు బైఠాయించారు. దీంతో అధికారులకు సమాచారం ఇవ్వగా తహసీల్దార్ చింతరవి, నారాయణపేట మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివరెడ్డి రైతులతో మాట్లాడారు. సీసీఐ అధికారులతో చర్చించారు. అనంతరం అధికారులు పత్తి కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. రాస్తారోకోకు మద్దతుగా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్, బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు రమేష్, ఏబీవీపీఎంఎఫ్ మండల ఉపాధ్యక్షుడు లింగప్ప పాల్గొని మాట్లాడారు.



వర్షాన్ని సైతం లెక్క చేయకుండా రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న రైతులు

## పత్తి కొనుగోలు చేయాలి

- రైతుల రాస్తారోకో - దిగొచ్చిన అధికారులు

నారాయణపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట మండలంలోని లింగంపల్లి పత్తి మిల్లులో సీసీఐ పత్తి కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేస్తూ బుధవారం రైతులు మహబూబ్‌నగర్-నారాయణపేట అంతర్రాష్ట్ర రహదారిపై గంట పాటు రాస్తారోకో చేశారు. స్లాట్ బుక్‌చేసుకున్న రైతులు తమ వాహనాల్లో పత్తిని విక్రయించేందుకు రాగా, తుఫాన్ వర్షం వల్ల కొనుగోలు చేయకపోవడంతో ఆగ్రహించిన రైతులు పత్తి కొనేవరకు రాస్తారోకో ఆగదని భీష్మించారు. రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి సీసీఐ ప్రత్యేక అధికారి అనిల్ మిశ్రాతో ఫోన్‌లో మాట్లాడి కొనుగోలు చేయాలని ఆదేశించారు. అలాగే జిల్లా మార్కెటింగ్ అధికారి బాలమణి, నారాయణపేట మార్కెట్ సూపర్‌వైజర్ లక్ష్మణ్‌లు అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడి శాంతింపజేశారు. సీసీఐ అధికారులు కొనుగోళ్లకు చర్యలు తీసుకున్నారు.

45 వాహనాల్లో 29 బండ్లు 8-12 శాతం తేమ ఉండడంతో సీసీఐ అధికారులు కొనేందుకు ఎంపిక చేశారు. మిగతా 16 వాహనాల పత్తి 15 నుంచి 20 శాతం తేమ రావడంతో కొనుగోళ్లు తిరస్కరించారు. దాంతో రైతులకు నిరాశ తప్పలేదు.



లింగంపల్లి కాటన్‌మిల్లు దగ్గర తేమశాతం పరిశీలిస్తున్న సీసీఐ అధికారులు

## భారీ వర్షాలకు సరళాసాగర్ సైఫన్లు ఓపెన్



సైఫన్లు తెరుచుకుని బయటికి వెళ్తున్న నీరు

మదనాపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వనపర్తి జిల్లా మదనాపురం మండలంలోని ప్రాజెక్టులు, వాగులు నిండుకున్నాయి. మండలంలో ఆటోమెటిక్ సైఫన్ సిస్టం కలిగిన సరళాసాగర్ ప్రాజెక్టు నిండి రెండు సైఫన్లు తెరుచుకున్నాయి. అదే విధంగా రామన్‌పాడు ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తి 5వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఊకచెట్టు వాగుపై ఉన్న లోలెవెల్ వంతెనపై వరద నీరు ప్రవహిస్తుండడంతో ఆత్మకూర్, వనపర్తిలకు రాకపోకలు నిలిచిపోయాయి.

**911 మిలియన్ యూనిట్లకు చేరిన జల విద్యుత్ ఉత్పత్తి**

ఆత్మకూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద వస్తున్న కారణంగా ఎగువ దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 911 యూనిట్ల ఉత్పత్తిని ఎగువ దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ద్వారా రాబట్టామని జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఎస్ఈ శ్రీధర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎగువ రాజుల ఉత్పత్తి కేంద్రంలో 4 యూనిట్లను ప్రారంభించి 3.423 మిలియన్ యూనిట్లను చేపట్టగా, ఇప్పటివరకు 461.405 మిలియన్ యూనిట్లను చేపట్టినట్లు తెలిపారు. అలాగే దిగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో మూడు యూనిట్లను ప్రారంభించి 3.507 మిలియన్ యూనిట్లను చేపట్టగా, ఇప్పటివరకు 450.099 మిలియన్ యూనిట్లను చేపట్టినట్లు తెలిపారు.

## కేఎల్ఐ కాలువకు గండి



రాచాలపల్లి శివారులో గండిపడి వృథాగా వెళ్తున్న కేఎల్ఐ నీరు

ఊర్కొండ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలోని రాచాలపల్లి శివారులో బుధవారం కేఎల్ఐ కాలువకు గండి పడింది. దాంతో దాని పరిసర ప్రాంత పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు గండిని వెంటనే పూడ్చాలని రైతులు కోరుతున్నారు.

## ఈతవనం ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్ఐ



ఈత వనాలను పరిశీలిస్తున్న ఎస్ఐ యుగంధర్‌రెడ్డి

పెబ్బేరురూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా పెబ్బేరు మండల పరిధిలోని పాతపల్లి గ్రామంలో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గౌడ కులస్థుల ఈత వనాలను ధ్వంసం చేసిన ఘటనా స్థలాన్ని పెబ్బేరు ఎస్ఐ యుగంధర్‌రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. సిబ్బందితో చేరుకున్న ఎస్ఐ చుట్టుపక్కల గల ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం స్థానికంగా ఉన్న గౌడ కులస్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా పాతపల్లి గ్రామంలోకి వెళ్లి యువకులు, పెద్దలు అన్ని కులాల వారితో సమావేశం నిర్వహించారు. సమస్యలున్నప్పుడు తగదాలకు తావివ్వకుండా శాంతియుతంగా పెద్దల సహకారంతో పరిష్కరించుకోవాలని సూచించారు. గౌడ కులస్థులు ఇచ్చిన ఫిర్యాదును అందుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

**అనారోగ్యంతో కాంగ్రెస్ నాయకురాలి మృతి**

కొత్తకోట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన 14వ వార్డు కాంగ్రెస్ పార్టీ నాయకురాలు మరియమ్మ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసకున్న ఆ పార్టీ నాయకులు మార్కెట్ చైర్మన్ ప్రశాంత్, జిల్లా ప్రధాన కార్యదర్శులు కృష్ణారెడ్డి, బోయోజ్, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసులు, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మిషేక్, సుభాష్ మృతురాలు మరియమ్మ ఇంటికెళ్లి సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. జేఎస్. రాములు ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు అంత్యక్రియల నిమిత్తం నగదును అందజేశారు. సంస్థ నిర్వాహకులు ఉపాధ్యాయులు భక్తరాజ్, అమృతరాజ్, సతీస్‌రాజ్, శ్యాం కుమార్, కర్ణ కుమార్, బీఆర్ఎస్ నాయకులు అయ్యన్న ఉన్నారు.

## అత్తారింట్లో అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

- కేసు కాకుండా పంచాయితీ చేసిన ఇరు గ్రామపెద్దలు!



అన్నపూర్ణ (ఫైల్)

ఊట్కూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : పెళ్లి అయిన మూడేళ్లకే అనుమానాస్పద స్థితిలో అన్నపూర్ణ (28) మృతి చెందిన సంఘటన నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలోని పులిమామిడి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. మండలంలోని మగ్దూంపూర్ గ్రామానికి చెందిన రాఘమేను కుమార్తె అన్నపూర్ణను పులిమామిడి గ్రామానికి చెందిన బుడ్డోళ రాముతో గత మూడు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి నెలల కుమారుడు ఉన్నాడు. అయితే అత్తవారింట్లో ఉన్న అన్నపూర్ణ బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. విషయం తెలుసుకున్న యువతి తల్లిదండ్రులు పులిమామిడి గ్రామానికి చెరుకుని మృతదేహాన్ని పరిశీలించగా, శరీరంపై గాయాలు కనిపించడంతో మృతిపైన అనుమానం వ్యక్తం చేశారు. గొడవకు దిగారు. తమ కుమార్తె మృతికి భర్తతో పాటు అతని కుటుంబ సభ్యులే కారణం అని వారు ఆరోపించారు. అయితే ఈ సంఘటన విషయం బయటకు రాకుండా ఇరు గ్రామాలకు చెందిన కొందరు పెద్దలు పంచాయితీ నిర్వహించారు. మృతురాలి తల్లిదండ్రులు ఇచ్చిన కట్నం డబ్బులు, బంగారంతో పాటు మూడు ఎకరాల పొలం ఇవ్వాలని ఒప్పందం చేసుకుని, కేసు కాకుండా జాగ్రత్త పడ్డారు. అయితే, ఈ విషయం బయటికి రావడంతో ఇరుగ్రామాల్లో చర్చించుకున్నారు. ఈ విషయంపై ఎస్ఐ రమేష్‌ను వివరణ కోరగా, మాకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని అన్నారు.

## జేపల్లి వాసికి విద్యారత్న అవార్డు



గోరటి వెంకన్నతో విద్యారత్న అవార్డు అందుకుంటున్న ప్రభాకర్‌రెడ్డి

చారకొండ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలోని జేపల్లి గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు మద్ది ప్రభాకర్‌రెడ్డి మాడ్గుల మండలం కొలుకలపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. బుధవారం హైదరబాద్‌లోని శ్రీత్యాగ రాయగాన సభలో చిక్క రామదాసు మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాహితీవేత్త చిక్క రామదాస్ జయంతి సందర్భంగా ప్రజాకవి ఎమ్మెల్సీ గోరటి వెంకన్న హాజరై మద్ది ప్రభాకర్‌రెడ్డికి విద్యారత్న అవార్డు అందజేసి శాలువతో సత్కరించారు. విద్యరంగంలో విశిష్ఠ సేవలు అందిస్తున్న ప్రభాకర్‌రెడ్డిని గుర్తించి అవార్డుతో సత్కరించడం సుముచితంగా ఉందని ఈసందర్భంగా ఎమ్మెల్సీ గోరటి వెంకన్న కొనియాడారు. ప్రభాకర్‌రెడ్డికి అవార్డు రావడంతో జేపల్లి గ్రామస్థులు, కుటుంబ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## మహిళ మృతి కేసును ఛేదించిన పోలీసులు



వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్ క్రైం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన మహిళ కొమ్మరి సౌమ్యలత (32) కేసును ఛేదించి నిందితుడు భోగి మల్ల విజయ్‌కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. కొల్లాపూర్ సీఐ పరిధిలోని పెంట్లవెల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో గల మంచాలకట్ట గ్రామ శివారులో సాకలి రాము గుట్ట అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన సంఘటనపై కేసు అక్టోబరు 13న నమోదైంది. ఈ సంఘటనపై నాగర్‌క ర్నూల్ డీఎస్పీ బుర్రి శ్రీనివాస్‌యాదవ్ కొ ల్లాపూర్ సీఐ మహేష్ ఆధ్వర్యంలో పోలీస్ బృందం సవాలుగా తీసుకుని మహిళా హ త్య కేసును ఛేదించినట్లు ఆయన తెలిపారు.

కొల్లాపూర్ పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో నివాసముంటున్న సౌమ్యలత అదే కాలనీలో నివాసం ఉంటున్న విజయ్‌కు మార్ ఆమెతో పరిచయం ఏర్పరుచుకుని వివాహేతర సంబంధాన్ని కొనసాగించారు. గత కొన్ని రోజుల క్రితం విజయ్‌కుమార్‌కు మరో అమ్మాయితో ప్రేమ వివాహం నడిపి ఆమెను పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఆ విషయం తెలుసుకున్న సౌమ్యలత ఆమెను దూరం పెట్టాలని నాతో వివాహం చేసుకోవాలని విజయ్‌కుమార్‌ను అడిగింది. దీంతో సౌమ్యల తను ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలనుద్దేశంతో ఉన్న విజయ్ కుమార్ అంతలోనే సౌమ్యలత అక్టోబరు 8న అతడు పని చేస్తున్న బజాజ్ ఫైనాన్స్ దగ్గరకు వెళ్లి నీ దగ్గర మాట్లాడాలని ఫోన్ చేసింది. అంతలోనే విజయ్‌కుమార్ ఇక్కడ కాదు మనం మంచాలకట్ట వెళ్లి అక్కడ మాట్లాడుకుందామని చెప్పి ఆమెను పెంట్లవెల్లికి బస్సులో రమ్మన్నారు. అక్కడి నుంచి తన బైకును మంచాలకట్ట పరిధిలోని సాకలి రాము గుట్ట దగ్గరికి తీసుకెళ్లి ఆమెతో మాట్లాడాడు. ఆవేశానికి గురై ఆమెను హత్య చేశాడు. తదుపరి మంచాలకట్ట గ్రామం లోకి వచ్చి రెండు లీటర్ల పెట్రోల్, అగ్గిపెట్టే తీ సుకుని హత్య చేసిన సంఘటన స్థలానికి వెళ్లి ఆమె మృతదేహంపై పెట్రోల్ పోసి నిప్పంటిం చాడు. అక్కడి నుంచి పరారయ్యాడు. అక్టోబరు 13న అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన సంఘటన మంచాలకట్ట గ్రామపంచా యతీ కార్యదర్శి సమాచారం మేరకు కేసు నమోదైంది. సౌమ్యలత తండ్రి గుజ్జుల బాలస్వామి తన కూతురు కన్పించడం లేదని, కొల్లాపూర్ సర్కిల్ ఆఫీస్‌లో ఫిర్యాదు చేశాడు. అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన మహిళ మృతదేహాన్ని మృతురాలి తండ్రిని చూపించగా తన కూతురుగా నిర్ధారించాడు.

ఈ సంఘటనపై డీఎస్పీ శ్రీనివాస్‌యాదవ్ సీఐ మహేష్‌ల ఆధ్వర్యంలో కేసును సవాల్‌గా తీసుకుని పట్టుకున్నారు. ఈ సంఘటనలో హత్య చేసినట్లు ఒప్పుకున్న విజయ్‌కుమార్‌ను అతని బైకును సెల్‌ఫోన్ సీజ్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసు సవాల్‌గా స్వీకరించి దర్యాప్తు చేసి నిందితున్ని పట్టుకున్న డీఎస్పీ శ్రీనివాస్‌యాదవ్, సీఐ మహేష్, కొల్లాపూర్, పెంట్లవెల్లి ఎస్ఐలను ఎస్పీ అభినందించారు.

క్రైం కార్నర్

## పాడుబడ్డ బావిలో మృతదేహం లభ్యం

ఉప్పునుంతల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల సమీపంలోని పాడుపడ్డ బావిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం అయినట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పునుంతల గ్రామ సమీపంలోని పాడుపడ్డ బావిలో గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు నీరు పెరగడంతో శవం తేలి ఉండటం గమనించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. ఉప్పునుంతల పోలీసు స్టేషన్‌లో మిస్సింగ్ కేసులు నమోదు కాలేదని, అచ్చంపేట పోలీసులకు సమాచారం అందించారు. అచ్చంపేట మండలం లింగోటం గ్రామానికి చెందిన కాట్రావత్ శంకర్ నాయక్ (45) గత పది రోజుల కిందట అదృశ్యం అయ్యాడు. అచ్చంపేట పోలీసులు మిస్సింగ్ కేసుపై కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని పరిశీలించారు. శంకర్‌నాయక్‌గా గుర్తించారు. మృతదేహం అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## ముంబయిలో వలస కూలీ మృతి


మాల జిందప్ప (ఫైల్)

కృష్ణ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ముంబయిలో వలస కూలీ మాల జిందప్ప ప్రమాదశాత్తు భవనం పైనుంచి కిందపడి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపారు. వారి వివరాల మేరకు... నారాయణపేట జిల్లా కృష్ణ మండల పరిధిలోని మురహర్ దొడ్డి గ్రామానికి చెందిన మాల జిందప్ప భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు, కూతుర్లతో కలిసి గత పది సంవత్సరాల నుంచి ముంబయి, ముడమాల్ గల్లీలో నివాసం ఉంటూ భవన నిర్మాణ పనులు చేస్తున్నారు. ఎప్పటిలాగే భవన నిర్మాణ పనులకు మంగళవారం భార్య, భర్త వెళ్లారు. నూతన భవనం పనులు నిమిత్తం పరంజలు కట్టి రాత్రి ఇంటికి వెళ్లే సమయానికి రూప్ సహాయంతో కిందికి దిగుతూ ప్రమాదవశాత్తు 14వ అంతస్తు భవనం నుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. అక్కడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు భార్య లక్ష్మి తెలిపారు. కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాకేష్ కోరారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


జితేందర్ నాయుడు (ఫైల్)

వడ్డేపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : వడ్డేపల్లి మండల పరిధిలోని పైపాడు గ్రామ శివారులో మానవపాడు గ్రామానికి చెందిన జితేందర్ నాయుడు (27) పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ నాగశేఖర్ రెడ్డి తెలిపారు. వారం రోజులుగా గుండెపోటుతో బాధపడుతుండటంతో పురుగుల మందు తాగగా, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు. కాగా, చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి భార్య భారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

### చికిత్స పొందుతూ మహిళ మృతి


కోటకొండ అంజమ్మ (ఫైల్)

నారాయణపేట న్యూటౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆదివారం పెబ్బేరు బస్టాండ్‌లో బస్సు వెనకాల మూత్ర విసర్జనకు వెళ్లి బస్సు టైర్ల కింద రెండు కాళ్లను పోగొట్టుకున్న కోటకొండ అంజమ్మ మంగళవారం రాత్రి గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. గతంలో భర్త హఠాన్మరణం, కుమారుడు మిద్దెపై నుంచి పడి మరణించడం.. ఇప్పుడు ఈమె మరణం ఆ ఇంట్లో తీవ్ర విషాదాన్ని నింపింది.

## విద్యుదాఘాతంతో ఆవు మృతి


వటువర్లపల్లిలో రిలయన్స్ టవర్ దగ్గర విద్యుదాఘాతంతో మృతి చెందిన ఆవు

బ్రహ్మగిరి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మేత కోసం వెళ్లి విద్యుత్ షాక్ తగిలి పాడి ఆవు మృతి చెందింది. అమ్రాబాద్ మండలం వటువర్లపల్లి గ్రామానికి చెందిన రైతు సలువాది ఉసేన్ పాడి ఆవు మంగళవారం రాత్రి రిలయన్స్ సెల్ టవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్‌కు తగిలి మృతి చెందింది. దీని విలువ సుమారు రూ. 50 వేలు ఉంటుందని, సెల్‌టవర్ యాజమాన్యం, విద్యుత్ శాఖ తరుపున నష్ట పరిహారం చెల్లించి రైతును ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## అక్రమంగా నిల్వ చేసిన మద్యం పట్టివేత

మాగనూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మాగనూరు మండలంలోని నేరడ్ గమ్ విక్రమ్ దాబాలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారని సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ అశోక్‌బాబు ఆధ్వర్యంలో బుధవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో దాబా యజమాని విక్రమ్ వద్ద నుంచి రూ.19,030 విలువ గల 30.87 లీటర్ల మద్యం సీజ్ చేసి అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. అక్రమంగా మద్యం, సిట్టింగ్‌లు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## తనిఖీల్లో...


మద్యాన్ని పట్టుకున్న పోలీసులు

కోస్గి రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మద్యం అక్రమంగా అమ్ముతున్న ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేసిన సంఘటన నారాయణపేట జిల్లా కోస్గి మండల పరిధిలో బుధవారం చోటుచేసుకొంది. అక్రమంగా మద్యం అమ్ముతున్నారన్న సమాచారంతో మండల పరిధిలోని కడంపల్లి గేటు దగ్గర మాసాయపల్లికి చెందిన కృష్ణయ్య, కడంపల్లికి చెందిన వెంకటయ్య గౌడ్‌ల షాపుల్లో పోలీసులు సోదాలు చేశారు. అక్రమ మద్యం అమ్ముతూ సిట్టింగులు నిర్వహిస్తున్నట్లు కనుగొన్నారు. పోలీసులు వీరి వద్ద నుంచి సమారు రూ 13,200ల విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకొని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. అక్రమ మద్యం అమ్మకాలకు పాల్పడిన షాపు యజమానులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బాలరాజు తెలిపారు.

## బీజేపీ గట్టు మండల అధ్యక్షుడు మృతి

గట్టు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : గట్టు మండల బీజేపీ అధ్యక్షుడు గూడురు నాగప్ప (45) బుధవారం తెల్లవారు జామున మృతి చెందాడు. అర్ధరాత్రి బీపీ పెరగడంతో కుటుంబ సభ్యులు ముందుగా స్థానిక ఆసుపత్రికి తీసుకవెళ్లారు. అక్కడి నుంచి గద్వాల ఆసుపత్రికి తీసుకువెళ్లారు. గద్వాలలోని వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కర్నూల్ ఆసుపత్రికి తీసుకవెళ్లారు. అనంతరం ఆయన కర్నూల్‌లో తుది శ్వాస విడిచారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈయన మృతి పట్ల మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ, బీజేపీ నాయకురాలు డీకే స్నిగ్ధారెడ్డిలు సంతాపం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు, మండలంలోని వివిధ గ్రామాల బీజేపీ కార్యకర్తలు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## 'కూతురు మృతిపై ఎలాంటి అనుమానం లేదు'

నాగర్‌కర్నూల్ క్రైం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : తన కూతురు స్ఫూర్తి(21) ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందిందని, ఈ సంఘటనపై తనకు ఎలాంటి అనుమానం లేదని మృతురాలి తండ్రి జరపట్టి కృష్ణయ్య పోలీసులకు తెలిపారు. తన కూతురు స్ఫూర్తి దసరా పండుగ నుంచి మానసికంగా ఇబ్బందులకు గురయ్యేదని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. గత కొంతకాలంగా అనారోగ్యానికి గురైందని ఆయన పేర్కొనట్లు ఎస్‌ఐ చెప్పారు. ఈ సంఘటనపై వృద్ధురాలు తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్ప జెప్పినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

# అంతా మా ఇష్టం!

- మెడికల్ గ్రౌండ్స్ పేరుతో ఉపాధ్యాయుల తప్పుడు సమాచారం
- విద్యాశాఖలో నిబంధనలు పాటించని పరిస్థితి

● నిబంధనలకు విరుద్ధంగా అక్రమ డిప్యుటేషన్లు



ఎనుగొండలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖలో అక్రమ డిప్యుటేషన్ల పర్వం కొనసాగుతున్నది. పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వుల ప్రకారం డిప్యుటేషన్స్ ఇవ్వకూడదన్న నిబంధనలు ఉన్నాయి. పాఠశాలల్లో విద్యార్థుల బోధనకు సరిపడా ఉపాధ్యాయులు లేకుంటే ప్రభుత్వం టీచర్లను సర్దుబాటు చేయాలని ఉత్తర్వులు కూడా ఇచ్చింది. అయితే, జిల్లాలో ఆ నిబంధనలను అతిక్రమిస్తూ మండల విద్యాశాఖ అధికారులు ఇష్టం వచ్చినట్లు ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారు. దీనిపై ఇప్పటికే విద్యాశాఖ అధికారులపై పలు విమర్శలు వస్తున్నాయి. తాజాగా మంగళవారం రాత్రి మరో ఐదుగురికి అక్రమ డిప్యుటేషన్స్ ఇస్తూ ఉత్తుర్వులు ఇచ్చారు. ఒక్కరు మాత్రం మెడికల్ గ్రౌండ్ కిందికి వస్తారు. మరో నలుగురు మాత్రం మెడికల్ గ్రౌండ్ కిందకు రారని వారంతా ఏదో తప్పుడు సమాచారం ఇచ్చారని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి.

ఇదిలా ఉంటే, పాఠశాల విద్యాశాఖ రాష్ట్ర అధికారులు బీఈడీ, డీఈడీ కళాశాలల్లో ఏవరైనా ఉపాధ్యాయులు డిప్యుటేషన్‌పై విధుల్లో ఉంటే వారి సొంత పాఠశాలలకు పంపించాలని విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ఆదేశాలు ఇచ్చారు. కానీ జిల్లా కేంద్రంలోని బీఈడీ, డీఈడీ కళాశాలల్లో ఉపాధ్యాయులు కొనసాగుతున్నారు. వారు పని చేస్తున్న సొంత పాఠశాలల్లో బోధన కొరకు సబ్జెక్టు ఉపాధ్యాయులు లేక ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులకు సబ్జెక్టులకు సంబంధించిన బోధన ఇతర సబ్జెక్టుల ఉపాధ్యాయులతో చేయిస్తున్నారు. బోయపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుల బీఈడీ కళాశాలకే పరిమితం అయ్యారు. దీనివెనుక స్వయంగా కళాశాల ప్రిన్సిపాల్ ఉన్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక్కడ డిప్యుటేషన్‌పై ఉంటూ సదరు ఉపాధ్యాయుడు బోయపల్లి పాఠశాలలో వేతనం తీసుకుంటున్నాడు. ఇదిలా ఉంటే, మరో ఉపాధ్యాయుడిని తాజాగా వారం రోజుల కిందట అడ్డాకుల మండలం నుంచి బీఎడ్ కళాశాలకు డిప్యుటేషన్ ఇచ్చారు. డైట్ కళాశాలకు నవాబ్‌పేట మండలం నుంచి ఒకరు, మరో మండలం నుంచి ఉపాధ్యాయుడిని డిప్యుటేషన్ ఇచ్చారు. అసలు డిప్యుటేషన్ ఇవ్వవద్దని ప్రభుత్వం చెపుతుంటే జిల్లాలో డిప్యుటేషన్ ప్రక్రియ మళ్లీ మొదలైంది.

### మెడికల్ గ్రౌండ్ పేరుతో...

మెడికల్ గ్రౌండ్ పేరుతో కొందరు ఉపాధ్యాయులు డిప్యుటేషన్స్‌కు మళ్లీ జిల్లాలో తెర తీశారు. కొందరికి ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేకున్నా చిన్న చిన్న సమస్యలు ఉంటే వాటిని పెద్దవిగా చూపడం పరిపాటిగా మారింది. అందుకు సంబంధించి తప్పుడు సమాచారం ఇచ్చి విద్యాశాఖ అధికారులపై ప్రజాప్రతినిధుల చేత ఒత్తిడి తెప్పించి బురిడీ కొట్టిస్తున్నారు. దీంతో అసలైన మెడికల్ ఇబ్బందులు ఉన్న టీచర్లకు అన్యాయం కలుగుతోంది. భూత్పూర్ మండల పరిధిలోని ఓ టీచర్ కాలేయవ్యాధితో ఇబ్బంది పడుతుండగా, డిప్యుటేషన్ ఇవ్వలేదు. కోయిలకొండ మండల పరిధిలో పనిచేసే ఓ టీచర్ తీవ్ర అనారోగ్యసమస్యలతో ఇబ్బంది పడుతుండగా, పలుమార్లు విద్యాశాఖ కార్యాలయంలో వినతులు ఇచ్చినా సదరు టీచర్‌కు డిప్యుటేషన్ ఇవ్వలేదు. అధికారులు కూడా ఒత్తిళ్లకు తలొగ్గి అనారోగ్యం ఉన్న వారికి మెడికల్ గ్రౌండ్ కింద డిప్యుటేషన్ ఇవ్వకుండా పైరవీలు చేసే వారికి ఇస్తుండటం గమనార్హం. గత కొన్నిరోజులుగా విదేశాలకు వెళ్లి ఇటీవల తిరిగి వచ్చిన ఉపాధ్యాయురాలు ఆరోగ్యంగా ఉన్నా మెడికల్ గ్రౌండ్ కింద డిప్యుటేషన్ ఇవ్వడం తీవ్ర విమర్శలకు దారితీస్తున్నది. 7

### అంతా ఎనుగొండ ప్రాథమిక పాఠశాల వైపే...

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎనుగొండ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 152 మంది విద్యార్థులు ఉన్నారు. అక్కడ విద్యార్థులకు సరిపడా ఆరుగురు ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. అక్కడికి మరో ఉపాధ్యాయుడిని మెడికల్ గ్రౌండ్ కింద డయాలసిస్ పేషెంట్‌ను ఇచ్చారు. మానవత దృక్పథంతో ఇది ఇవ్వాల్సిన అవసరం ఉంది. కానీ మరో ఇద్దరు ఉపాధ్యాయులకు తాజాగా మంగళవారం రాత్రి డిప్యుటేసన్ ఇచ్చారు. దీనిపై ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దీంతో అక్కడ మొత్తం తొమ్మిది మంది ఉపాధ్యాయులు ప్రస్తుతం ఉన్నారు.

### అక్రమ డిప్యుటేషన్లు రద్దు చేయాలి



జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న అక్రమ డిప్యుటేషన్స్‌ను రద్దు చేయాలని, మెడికల్ గ్రౌండ్ పేరుతో అక్రమ డిప్యుటేషన్ ఎలా ఇస్తారు. డీఈవో ఇచ్చిన ఉత్తర్వులలో ఒకే ఒక్కరు మెడికల్ గ్రౌండ్స్ కిందకు వస్తారు. ఆయనకు కూడా దూరంగా ఇచ్చారు. బీఈడీ డీఈడీ కళాశాలల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా డిప్యుటేషన్ ఇచ్చారు.

- వెంకటేశ్, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

### అర్హులైన వారి మెడికల్ గ్రౌండ్ కింద ఇవ్వాలి



మెడికల్ గ్రౌండ్స్ కింద ఆనారోగ్యం ఉన్న వారికి మానవత దృక్పథంతో ఇవ్వాలి. కానీ ఎలాంటి ఇబ్బంది లేని వారికి దగ్గరి పాఠశాలల్లో ఇచ్చారు. కొందరికి అయితే గత 15 ఏళ్లగా పాలమూరు పట్టణం చుట్టూ ఉన్న పాఠశాలల్లో డిప్యుటేషన్ ఇస్తున్నారు. ఇదెక్కడి న్యాయం. అలాంటి వారి డిప్యుటేషన్ తొలగించాలి.

- శ్యాంబాబు, పీఆర్టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు

### తప్పుడు సమాచారం ఇచ్చిన వారిపై చర్యలు తప్పవు



మెడికల్ గ్రౌండ్‌లో మానవత దృక్పథంతో ఐదుగురు టీచర్లకు డిప్యుటేషన్స్ ఇచ్చాం. దీనిపై పలు ఫిర్యాదులు వస్తున్నాయి. మరోసారి పరిశీలిస్తాం. తప్పని తేలితే చర్యలు తీసుకుంటాం. బీఈడీ, డీఈడీ కళాశాలలో డిప్యుటేషన్స్ ఇచ్చాం. వాటిపైకుడా పరిశీలిస్తాం.

- ప్రవీణ్‌కుమార్, డీఈవో మహబూబ్‌నగర్

# పిల్లలకు ఇబ్బందులు రాకుండా చూడాలి

- రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడి


అలంపూర్ కేజీబీవీ పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఈతా దయాకర్‌రెడ్డి

అలంపూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని, విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడి అధికారులకు సూచించారు. బుధవారం జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి వారిని దర్శించుకొని ఉభయ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు పొందారు. అనంతరం పట్టణ కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం, కేజీబీవీ, అనంతరం గద్వాలలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ గర్ల్స్ స్కూళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి విద్యార్థులతో స్నేహపూర్వకంగా ముచ్చటించి, అక్కడ కల్పిస్తున్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు.

మధ్యాహ్న భోజనాన్ని కూడా పరిశీలించి, ఆహార నాణ్యతపై సిబ్బందికి సూచనలు ఇచ్చారు. కమిషన్ సభ్యులు అపర్ణ, ప్రేమలత అగర్వాల్, వందన, చందన, వచన్ కుమార్, అడిషనల్ కలెక్టర్ నర్సింగ రావు, జిల్లా సంక్షేమ అధికారి సునంద, ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ పవన్, డీసీసీవో నరసింహ, సీడీపీవో సుజాత, సీవీసీ ఛైర్మన్ సహదేవుడు, మెంబర్ శైలజ, తహసీల్దార్ మంజులా, ఎంఈవో అశోక్ కుమార్, సూపర్‌వైజర్ నర్గీస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# అందరికీ సమాన, ఉచిత విద్య కోసం ఉద్యమించండి



సమావేశంలో మాట్లాడుతున్న సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ

వనపర్తి విద్యా విభాగం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా కేంద్రంలో నాగవరం రోడ్డులో గల ఓ ప్రైవేట్ హాల్‌లో పీడీఎస్‌యూ 4వ రాష్ట్ర మహాసభలలో భాగంగా రెండవ రోజు బుధవారం రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకట్‌రెడ్డి పీడీఎస్‌యూ బిగి పిడికిలి జెండాను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థి ప్రతినిధుల మహాసభలను ప్రారంభించారు. అనంతరం పీడీఎస్‌యూ విప్లవ విద్యార్థి ఉద్యమంలో అమరులైన విద్యార్థి వీరులకు సంతాప తీర్మానాన్ని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సాంబ ప్రవేశపెట్టగా మహాసభ ఆమోదించి రెండు నిమిషాలు మౌనం పాటించారు.

అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా మహాసభలకు విచ్చేసినటువంటి విద్యార్థి ప్రతినిధులకు ఆహ్వాన సంఘ అధ్యక్షుడు ఎం.రాఘవాచారి స్వాగత ఉపన్యాసం చేశారు. ఆ తర్వాత ప్రారంభమైన విద్యా గోష్టిలో మొదటి అంశమైన నూతన జాతీయ విద్యా విధానం - శాస్త్రీయ విద్య మధ్య వైరుధ్యాలు అనే అంశంపై హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ ప్రసంగించారు. సమాజంలో ఆర్థికంగా ఉన్నతంగా ఉన్న వర్గాలకే విద్యను అందుతుందన్నారు. అనంతరం మహాసభలో మధ్యాహ్నం రెండవ సెషన్‌లో పీడీఎస్‌యూ చరిత్ర, 50 ఏళ్లలో నిర్వహించిన పోరాట క్రమాన్ని విద్యార్థులు త్యాగాలను గురించి పీడీఎస్‌యూ పూర్వ రాష్ట్ర కార్యదర్శి ప్రముఖ కవి జనజ్వాల ప్రసంగించారు. ఇంకా ఈ మహాసభలో పీడీఎఫ్ జాతీయ నాయకుడు ఈ విజయ్ కన్నా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎండీ రఫీ ఎస్.కిరణ్‌కుమార్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.భాస్కర్ తదితరులు మాట్లాడారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే.పవన్ కుమార్, రాచకొండ, రంజిత్, సతీష్, జె. గణేష్, కె.గణేష్ మందుల సైదులు అర్జున్, వంశీ రాజు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


చేనేత కార్మికులకు అవగాహన కల్పిస్తున్న సెంట్రల్ సిల్క్ బోర్ ఆఫీసర్ దీపక్ చౌదరి

రాజోలి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న చేనేత సంక్షేమ పథకాలను చేనేత కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని సెంట్రల్ స్కిల్ బోర్డు ఆఫీసర్ దీపక్ చౌదరి అన్నారు. మండల కేంద్రమైన రాజోలిలోని చేనేత సహకార సంఘం పర్సన్ దోత్రే శ్రీనివాసులు ఆధ్వర్యంలో బుధవారం సిల్క్ సమగ్ర రెండు పథకాలపై గాజులు చేనేత కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ సిల్క్ బోర్డు ఆఫీసర్ దీపక్ చౌదరి మాట్లాడుతూ చేనేత కార్మికులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకొని తమ వృత్తిలో అభివృద్ధిని సాధించాలని ఆయన అన్నారు. చేనేత కార్మికులు తమ వృత్తిలో నైపుణ్యత సాధించేందుకు అవసరమయ్యే పనిముట్లను 50 శాతం సబ్సిడితో కేంద్ర ప్రభుత్వం, 25 శాతం రాష్ట్ర ప్రభుత్వం కేవలం 25 శాతానికి కార్మికులు వాటాతో పనిముట్లను అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. అవసరమైన చేనేత కార్మికులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. అశోక్, ముత్తు నాయక్, సంఘం పర్సన్ ఇన్చార్జి శ్రీనివాసులు, చేనేత కార్మికులు, మాస్టర్ వీవర్లు పాల్గొన్నారు.

## రాబోయే రోజుల్లో బనదా ఎల్లమ్మ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోంది..

- అంబాత్రయ ఆదిత్య పరాశ్రీ స్వాములు


దేవాలయం నిర్మాణానికి శిలలకు ప్రత్యేక పూజలు చేస్తున్న మహాస్వాములు

కృష్ణ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో బనదా ఎల్లమ్మ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతుందని అంబాత్రయ క్షేత్ర ఆదిత్య పరాశ్రీ స్వాములు అన్నారు. కృష్ణ మండల కేంద్రంలోని కూస్నీ గ్రామ శివారులో వెలసిన బనదా ఎల్లమ్మ నూతన ఆలయ నిర్మాణ కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథిగా పాల్గొని బుధవారం వారు మాట్లాడారు. ప్రతి ఒక్కరు బనదా ఎల్లమ్మ అమ్మ వారి నూతన దేవాలయ నిర్మాణంలో భక్తులు, ప్రజలు తమవంతుగా తను మన ధనం సహాయం సహకారాలు అందించాలని ఆయన అన్నారు. అనంతరం బనదా ఎల్లమ తల్లిని దర్శించుకున్నారు. అనంతరం గ్రామస్థులు, భక్తులు స్వాముల వారికి శాలువా పూల మాలలతో సన్మానం చేశారు.

# బౌలింగ్, బ్యాటింగ్‌లో మెరుపులు

- క్రికెట్‌లో రాణిస్తున్న మహబూబ్‌నగర్ క్రీడాకారులు
- హెచ్‌సీఏ టూడే లీగ్ మెరిసిన ఉమ్మడి జిల్లా క్రికెటర్లు


హెచ్‌సీఏ 2డే లీగ్‌లో విజయం సాధించి ఉమ్మడి జిల్లా జట్టుతో ఎండీసీఏ సెక్రటరీ రాజశేఖర్(ఫైల్)

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) రాష్ట్రస్థాయి 2డే లీగ్‌లో ఉమ్మడి జిల్లా జట్టు క్రీడాకారులు రాణించారు. క్రీడాకారులు బ్యాటింగ్, బౌలింగ్‌లో అసమాన ప్రతిభ కనబరిచి సత్తాచాటారు. ఇటీవలే జరిగిన హెచ్‌సీఏ ప్రాబబుల్స్‌కు ఎంపికయ్యారు. జిల్లా క్రికెట్ సంఘం సహకారంతో గత ఏడాది గణేష్ రంజీ జట్టుకు ఎంపికకావటంతో పాటు ఇంగ్లండ్ కౌంటీలకు ఎంపికైన విషయం తెలిసిందే. క్రికెట్‌లో రాణిస్తున్న క్రీడాకారులపై 'ఆంధ్రజ్యోతి' కథనం...

### బ్యాట్ పడితే పరుగుల వరద....



మహబూబ్ నగర్ జిల్లా కేంద్రానికి చెందిన అబ్దుల్ రాఫె ఎంవీఎస్ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. ఎస్‌జీఎఫ్, హెచ్‌సీఏ, ఇంటర్ వర్సిటీ పోటీల్లో మెరిశాడు. బ్యాటింగ్‌తో పాటు కీపర్‌గా రాణిస్తున్నాడు. 2018లో మధ్యప్రదేశ్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-14 బాలుర జాతీయస్థాయి క్రికెట్ టోర్నీ, 2019లో హెచ్‌సీఏ అండర్-14 రాష్ట్ర జట్టులో, 2024లో చెన్నయ్‌లో జరిగిన సౌత్‌జోన్ క్రికెట్ టోర్నీలో పాల్గొని ప్రతిభ చాటాడు. 2025లో హెచ్‌సీఏ-2డే లీగ్‌లో 9 మ్యాచ్‌లు ఆడి 574 పరుగులు సాధించాడు. ఇందులో 3 సెంచరీలు, ఒక అర్ధసెంచరీ చేశాడు. హెచ్‌సీఏ అండర్-19 ప్రాబబుల్స్‌కు ఎంపికయ్యాడు. మూడు మ్యాచ్‌లు ఆడి, 98(అర్ధసెంచరీ), మొత్తం 127 పరుగులు, 9 క్యాచ్‌లు, 6స్టాంప్ అవుట్ చేసి ప్రతిభ చాటాడు. రంజీ జట్టుకు ఎంపికావడమే తన లక్ష్యం అంటున్నాడు అబ్దుల్ రాఫె.

### 31 వికెట్లతో ప్రతిభ...



మహబూబ్ నగర్‌కు చెందిన ముఖీదుద్దీన్ జిల్లా కేంద్రంలోని స్వామి వివేకానంద డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. 2024లో అండర్-19 హెచ్‌సీఏ టోర్నీలో ఉత్తమ బౌలర్‌గా నిలిచాడు. ఇంటర్ వర్సిటీ స్థాయి టోర్నీలో 4 మ్యాచ్‌ల్లో 8 వికెట్లు తీశాడు. 2025లో హెచ్‌సీఏ 2డే లీగ్ పోటీల్లో 31 వికెట్ల పడగొట్టాడీ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్. నిజాం కాలేజ్‌పై 8 వికెట్లు, వెస్ట్ మారెడ్‌పల్లిపై 5 హైదరాబాద్ బ్లూస్‌పై 4, ఖమ్మంపై 4, బాలజీ క్లాట్స్‌పై 3, చీర్‌ఫుల్ చామ్స్‌పై 3, రాకేష్ ఎలెవన్ జట్టుపై 2, రోహిత్ ఎలెవన్‌పై 2 మొత్తం 8 మ్యాచ్‌లో 31 వికెట్లతో రాణించాడు. హెచ్‌సీఏ అండర్-23 ప్రాబబుల్స్‌కు ఎంపియ్యాడు. మూడు మ్యాచ్‌ల్లో 4 వికెట్ల తీశాడు.

### హెచ్‌సీఏ 2 లీగ్‌లో సత్తా...



నాగర్‌కర్నూల్ జిల్లా తాడురుకు చెందిన జశ్వంత్ జిల్లా కేంద్రంలోని రిషి జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా క్రికెట్ టోర్నీలో ప్రతిభ చాటి ఉమ్మడి జిల్లాకు ఎంపికయ్యాడు. 2025లో హెచ్‌సీఏ 2డే లీగ్ పోటీల్లో 8 మ్యాచ్‌లు ఆడి 16 వికెట్ల పడగొట్టాడీ లెఫ్ట్ స్పిన్నర్. హైదరాబాద్ బ్లూస్‌పై 5, రాకెష్ ఎలెవన్‌పై 2, వెస్‌మారెడ్‌పల్లిపై 3, చీర్‌ఫుల్ చామ్స్‌పై 2, ఖమ్మంపై 1, బాలాజీ క్లాట్స్‌పై 3 వికెట్లు తీసి రాణించి. హెచ్‌సీఏ అండర్-19 ప్రాబబుల్స్‌కు ఎంపికయ్యాడు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

## గ్రీన్ చానల్ ద్వారా మధ్యాహ్న భోజన బిల్లులు

● మండల విద్యాధికారి బాలకిష్టప్ప



మద్దూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇక నుంచి మధ్యాహ్న భోజన నిర్వాహకులకు గ్రీన్ చానల్ ద్వారా బిల్లులు చెల్లించడం జరుగుతుందని మండల విద్యాధికారి బాలకిష్టప్ప అన్నారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలను వివరించారు.

**పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన బిల్లుల చెల్లింపు జరిగాయా?**

ఒకటి నుంచి 8వ తరగతి వారికి ఆగస్టు వరకు, 9 నుంచి పదో తరగతి వారికి మార్చి వరకు చెల్లింపులు పూర్తి చేశాం. అలాగే ఎగ్స్ బిల్లులు జనవరి వరకు క్లియర్ అయ్యాయి. ఇక జనవరి, ఫిబ్రవరి బిల్లులు ఎస్టీవో వద్ద పెండింగ్‌లో ఉన్నాయి.

**బిల్లుల చెల్లింపునకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటోంది?**

అక్టోబరు నుంచి గ్రీన్ చానల్ ద్వారా మధ్యాహ్న భోజన బిల్లుల చెల్లింపునకు చర్యలు తీసుకుంది. ఇక నుంచి నిర్వాహకుల ఖాతాల్లోనే నేరుగా బిల్లులు పడే అవకాశం ఉంది.

**బిల్లులు చెల్లింపుల్లో జాప్యంతో నిలిచిపోయిన పాఠశాల అదనపు గదుల నిర్మాణాలను ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లారా?**

అసంపూర్తి నిర్మాణాలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అలాగే గదుల లేమితో ఇబ్బందిగా ఉన్న పాఠశాలల్లో గదుల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కూడా కోరాము.

**నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలలపై ఎలాంటి చర్యలు తీసుకోనున్నారు?**

పాఠశాలల తనిఖీల్లో అలాంటివి ఏమైనా గుర్తిస్తే అట్టి వాటిపై చర్యలు తీసుకుంటాం.

న్యూస్ బాక్స్

### పత్తి స్లాట్ రద్దు చేసుకోండి

● మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి

నారాయణపేటరూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పేట మార్కెట్ పరిధిలోని భాగ్యలక్ష్మి, విజయ కాటన్‌మిల్లుల్లో పత్తి విక్రయించేందుకు ఈనెల 30, 31వ తేదీల్లో రైతులు బుక్ చేసిన స్లాట్‌లను రద్దు చేసుకోవాలని పేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ శివారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. భారీ వర్షాల కారణంగా సీసీఐ పత్తిని కొనుగోలు చేయడం లేదన్నారు. రైతులు తిరిగి స్లాట్ బుక్ చేసుకుని తేమ 8 నుంచి 12 శాతం ఉండేలా చూసుకుని పత్తిని విక్రయానికి తీసుకెళ్లాలని సూచించారు.

### ఊట్కూర్ ఎంపీడీవోగా విజయలక్ష్మి

ఊట్కూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఊట్కూర్ ఎంపీడీవోగా విజయలక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ధనుంజయ్‌గౌడ్ మహబూబ్‌నగర్ జిల్లాకు ఇటీవల బదిలీ కావడంతో ఆయన స్థానంలో కృష్ణ ఎంపీవో విజయలక్ష్మి బదిలీపై ఊట్కూర్‌కు వచ్చారు. ఉన్నతాధికారులు ఆమెకు ఎంపీడీవో పూర్తి స్థాయి బాధ్యతలు ఇచ్చారు. కార్యాలయ సూపరింటెండెంట్ కొండన్న, ఏపీవో లక్ష్మారెడ్డి, ఈసీ మహిపాల్‌రెడ్డి, సిబ్బంది ఆమెను శాలువాతో సన్మానించి, స్వాగతం పలికారు. ఫీల్డ్ అసిస్టెంట్లు ఆంజనేయులు, బాలస్వామి తదితరులున్నారు.

### ఎంపీడీవోకు సన్మానం

మరికల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవోగా పదవీ బాధ్యతలు చేపట్టిన పృథ్వీరాజ్‌ను ఎంఈవో మీర్జాకలీముల్లా బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, విద్యార్థులు ప్రథమ స్థానంలో ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలన్నారు. విద్యాశాఖ సిబ్బంది, శ్రీహరి ప్రసాద్, ఐఈఆర్‌పీ కోఆర్డినేటర్ శివకుమార్, అరుణ, సీఆర్పీలు ఉన్నారు.

### పాఠశాల తనిఖీ

గుండుమాల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బలభద్రయపల్లి పాఠశాలను ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తు వారితో ముచ్చటించారు. అనంతరం నిర్వాహకులకు సూచనలు చేశారు. ఆ తర్వాత రికార్డులను పరిశీలించారు.

### రన్ ఫర్ యూనిటీని విజయవంతం చేయాలి

కోస్గి రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఈనెల 31న నిర్వహించే రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోస్గి ఎస్‌ఐ బాలరాజు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి రన్ ఫర్ యూనిటీ 2కే రన్ ప్రారంభమై దౌల్తాబాద్ రోడ్డు వరకు కొనసాగుతుందన్నారు. మండల పరిధిలోని యువతీ యువకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

### శబరిమలకు పాదయాత్ర

మరికల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూచూర్ రవి గురుస్వామి ఆధ్వర్యంలో బుధవారం మరికల్ మండల కేంద్రం నుంచి ఎనిమిది మంది అయ్యప్ప స్వాములు శబరిమలకు పాదయాత్రగా బయలుదేరారు. స్వాముల కుటుంబ సభ్యులు మంగళ హారతులు పలికి వారిని సాగనంపారు. గురుస్వామి వారికి సలహాలు, సూచనలు చేశారు.

# టార్పాలిన్ల కోసం తంటాలు

» అద్దెతో రైతులపై అదనపు భారం

» ఇబ్బంది పడుతున్న అన్నదాతలు



ధాన్యంపై కప్పిన కవర్లు

మరికల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో వరికోతలు మొదలయ్యాయి. ఆరుగాలం శ్రమించి పండించిన పంట కొనుగోలు కేంద్రాలకు చేరుతోంది. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్ద, రోడ్డుపై పోసుకొని ఆరబెట్టుకుంటూ రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం సబ్సిడీపై టార్పాలిన్లు అందించకపోవడంతో రైతులు వాటిని అద్దెకు తెచ్చుకుంటూ అదనపు ఆర్థిక భారాన్ని మోస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు, తుఫానులతో ధాన్యాన్ని కాపాడుకునేందుకు వారు ఇబ్బంది పడుతున్నారు. ఇదే అదునుగా పొరుగు రాష్ట్రం నుంచి కొందరు వ్యాపారులు టార్పాలిన్లను అద్దెకు ఇచ్చేందుకు గాను గ్రామాల్లో దుకాణాలను ఏర్పాటు చేశారు. టార్పాలిన్ చిన్న సైజు రోజుకు రూ.20, పెద్ద సైజు రూ.50 చొప్పున అద్దె వసూలు చేస్తున్నారు. ఇప్పటికే ఎరువులు, విత్తనాలు, కూలీల ఖర్చుతో ఇబ్బంది పడుతున్న అన్నదాతలకు టార్పాలిన్లను కూడా అద్దెకు తీసుకోవాల్సిన పరిస్థితి రావడంతో వారు ఆర్థికంగా సతమతమవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం టార్పాలిన్లు సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

**అదనపు భారం పడుతోంది..**



టార్పాలిన్ల కొరతతో తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. కొనుగోలు కేంద్రంలో ధాన్యం ఆరబెట్టేందుకు ఏటా రైతులపై అదనపు భారం పడుతోంది. ప్రభుత్వం వెంటనే స్పందించి టార్పాలిన్లు సరఫరా చేసి ఆదుకోవాలి.

**- హన్మంతు, రైతు, పల్లెగడ్డ**

**రాయితీపై అందించాలి..**



రైతులకు సబ్సిడీపై టార్పాలిన్లు అందించాలి. సమయానికి టార్పాలిన్లు దొరకకపోవడంతో రోడ్డుపైనే వర్షానికి ధాన్యం తడుస్తోంది. ప్రభుత్వం ప్రతీ రైతుకు ముందుగానే రాయితీపై టార్పాలిన్లు అందిస్తే ధాన్యాన్ని కాపాడుకుంటాం. అద్దె టార్పాలిన్లతో ఖర్చు పెరుగుతోంది.

**- సంజన్నగారి వెంకట్‌రెడ్డి, రైతు, అప్పంపల్లి**

## మధ్యాహ్న భోజనం బిల్లులు చెల్లించాలి

» రేపు డీఈవో కార్యాలయం ముందు ధర్నా

మరికల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు చెల్లించాలని మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిల్లుల చెల్లింపు కోరుతూ శుక్రవారం డీఈవో కార్యాలయం ముందు కార్మికులతో కలిసి సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. బుధవారం ధన్వాడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంఈవో గాయత్రికి అందించారు. కార్మికులు సువర్ణ, అంజమ్మ, అనురాధ, షాహినాబేగం తదితరులున్నారు.

## మత్స్యకారుల ఆర్థిక పరిస్థితిని బలోపేతం చేస్తాం



దామరగిద్ద చెరువులో చేపలు వదులుతున్న నాయకులు

దామరగిద్ద, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల ఆర్థిక స్థితిని బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మత్స్యశాఖ సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు ఏ.కాంత్‌కుమార్ అన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన మండలంలోని కొత్తచెరువు, నాగమ్మ చెరువు, ఎలుక చెరువుల్లో మొత్తం లక్షా 60 వేల చేప పిల్లలను వదిలారు. అలాగే, ఆశన్‌పల్లి చెరువుకు 48 వేలు, చాకలివానిపల్లి చెరువుకు 36 వేలు, మాల్‌రెడ్డిపల్లి చెరువుకు 67 వేలు, పిడెంపల్లి చెరువుకు 30 వేల చొప్పున చేప పిల్లలను వదిలారు. మత్స్యశాఖ అధికారి రెహమాన్, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు సరాఫ్ నాగరాజ్, దామరగిద్ద అధ్యక్షుడు ఈదప్ప, ఎంపీడీవో సాయిలక్ష్మి, తహసీల్దార్ తిరుపతయ్య, సంఘం మండల నాయకులు హనుమంతు, వడ్ల నర్సిములు, నీల్లి వెంకట్రాములు, పోలీసు వెంకటప్ప, నర్సిములు, చాపలి శ్రీను, గడ్డమీది నారాయణ, రేనివట్ల వెంకటప్ప తదితరులున్నారు.

## కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి



నర్వలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

నర్వ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే ధాన్యాన్ని విక్రయించుకొని మద్దతు ధర పొందాలని విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సింగిల్ విండోలో బుధవారం ఆయన వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి, మాట్లాడారు. ఏవో అఖిలారెడ్డి, తహసీల్దార్ మల్లారెడ్డి, విండో వైస్ చైర్మన్ లక్ష్మణ్, సీఈవో ఉదయ్, సిబ్బంది, విండో డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చెన్నయ్యసాగర్ తదితరులున్నారు.

## మధ్యాహ్న భోజన వంట సామగ్రి పంపిణీ




మక్తల్‌లోని ఎంఆర్‌సీ వద్ద వంట సామగ్రి పంపిణీ చేస్తున్న మార్కెట్ చైర్‌పర్సన్ రాధాలక్ష్మారెడ్డి

మక్తల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మక్తల్ పట్టణంలోని మండల వనరుల కేంద్రం వద్ద బుధవారం మార్కెట్ చైర్‌పర్సన్ రాధాలక్ష్మారెడ్డి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మధ్యాహ్న భోజన వంట సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. విద్యార్థుల అభ్యున్నతికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎన్ని నిధులైనా ఖర్చు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో అనిల్‌గౌడ్, ఉపాధ్యాయులు నాగేశ్వరయ్య, నాగార్జున, కాంగ్రెస్ నాయకులు లక్ష్మారెడ్డి, గణేష్‌కుమార్, కట్ట సురేష్‌కుమార్, చెన్నయ్యగౌడ్, రాములు తదితరులున్నారు.

## పీఆర్సీని ప్రకటించి పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



జాజాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సురేష్

» తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్

నారాయణపేటరూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): చాలా రోజులుగా ఎదురు చూస్తున్న పీఆర్సీ కమిటీని వెంటనే ఏర్పాటు చేసి, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవత్ సురేష్, ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని జాజాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీనిచ్చి పెండింగ్‌లో పెట్టడం శోచనీయమన్నారు. టెట్ నుంచి 2010కి ముందు నియామకం పొందిన ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని కేంద్ర విద్యాశాఖ మంత్రిని కలిసి విన్నవిస్తామన్నారు. పేట జిల్లాలో ఉపాధ్యాయ ఖాళీలు అధికంగా ఉన్నందున వారి స్థానంలో వలంటీర్లను నియమించాలని కోరారు. హెచ్‌ఎం భారతి, జిల్లాసైన్స్ అధికారి భానుప్రకాశ్, రమేశ్, రవికుమార్, విశ్వనాథ్‌రెడ్డి, చిన్ననర్సిములు, సురేష్ బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### నేడు డయల్ యువర్ డీఎం

నారాయణపేట న్యూటౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట, కోస్గి డిపో పరిధిలోని పరిసర ప్రాంతాల ప్రయాణికులు గురువారం నిర్వహించనున్న డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని పేట డిపో మేనేజర్ లావణ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు తమ సమస్యలు, సలహాలు, సూచనల కోసం గురువారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటలలోపు 7382826293 నెంబర్‌కు ఫోన్ చేసి చెప్పాలని ఆమె పేర్కొన్నారు.

### వచ్చేనెల 3న డయల్ యువర్ ఎస్పీ

నారాయణపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి వచ్చేనెల 3న డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎస్పీ డా.వినీత్ బుధవారం తెలిపారు. జిల్లా ప్రజలు తమ సమస్యలను 08506-281182 నెంబర్‌కు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటలలోపు ఫోన్ చేసి తెలుపాలని కోరారు.

### ఘనంగా సహస్రార్జున్ జయంతి

నారాయణపేటరూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పేట జిల్లా కేంద్రంలో బుధవారం ఎస్ఎస్‌కే సమాజ్ ఆధ్వర్యంలో కార్తీక సప్తమి సందర్భంగా సహస్రార్జున్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలు, పురుషులు ప్రత్యేక తలపాగా ధరించి పురవీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎస్ఆర్ గార్డెన్స్‌లో ఎస్ఎస్‌కే సమాజ్ ఆరాధ్యుడు సహస్రార్జున్ చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

### సదర్ నిర్వహణపై వినతి



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న యాదవ సంఘం సభ్యులు

నారాయణపేట న్యూటౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తరపున అధికారికంగా సదర్ పండుగను నిర్వహిస్తామని ముఖ్యమంత్రి చెప్పగా ఇంతవరకు ఎప్పుడు నిర్వహిస్తారో తెలుపలేదని వెంటనే నిర్వహించేలా చేయాలని యాదవ సంఘం పట్టణ శాఖ తరపున బుధవారం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యాదవ సంఘం పట్టణాధ్యక్షుడు జి.చిన్నయ్యయాదవ్, ప్రధాన కార్యదర్శి కేశవులుయాదవ్, కార్యదర్శులు మారెప్పయాదవ్, ఎన్.అంజయ్యయాదవ్, ఎస్.బాలప్పయాదవ్, రమేశ్‌యాదవ్ తదితరులున్నారు.

### భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కొత్తపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో నిర్మాణంలో ఉన్న వాగులను ఎంపీడీవో కృష్ణారావు, తహసీల్దార్ జయరాములు బుధవారం పరిశీలించారు. వాగు పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అదేవిధంగా రైతులు వాగులు దాటే క్రమంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వారు సూచించారు.

### పత్తిని కొనుగోలు చేయాలని ప్రధానికి లేఖ

నారాయణపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలతో నష్టపోయిన పత్తి రైతులను ఆదుకోవడంతో పాటు అరకొరగా పండిన పత్తిని 20 శాతం తేమ ఉన్నా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం నారాయణపేట జిల్లాకు చెందిన సామాజిక కార్యకర్త నర్సింహ ప్రధాని నరేంద్రమోదీకి లేఖ పంపించారు. ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి నష్టపోయిన పత్తి రైతులకు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని ఆయన కోరారు.

### అంబేడ్కర్ విగ్రహ దాతకు సన్మానం

నర్వ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లంపల్లిలో అంబేడ్కర్ విగ్రహ దాత దండు అయ్యప్పను గ్రామస్థులు బుధవారం ఘనంగా సన్మానించారు. గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని గ్రామస్థులు ఆయనను కోరగా వెంటనే స్పందించడంపై గ్రామస్థులు ఆయనను శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

## పాఠశాలల్లో పఠనా సంస్కృతి ఏర్పడాలి

» కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతీ పాఠశాలల్లో పఠనా సంస్కృతి ఏర్పడేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో విద్యాశాఖపై ఆమె అధ్యక్షతన జూమ్ మీటింగ్ నిర్వహించారు. అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, ట్రైనీ కలెక్టర్ ప్రణయ్, జిల్లా విద్యాధికారి డా.గోవిందరాజులు, ప్లానింగ్ కోఆర్డినేటర్ నాగార్జునరెడ్డి, క్వాలిటీ కోఆర్డినేటర్ విద్యాసాగర్, కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ రాజేంద్రకుమార్, జెండర్ కోఆర్డినేటర్ నర్మద, అసిస్టెంట్ స్టాటిస్టికల్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, జిల్లాలోని అన్ని మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు పఠనా సామర్థ్యం, లెక్కింపు నైపుణ్యం సాధించాలంటే ప్రతీ ఉపాధ్యాయుడు వారి పురోగతిని నిరంతరం సమీక్షించి మార్గదర్శకత ఇవ్వాలని సూచిం చారు. ప్రతీ పాఠశాలలో పఠన సంస్కృతి ఏర్పడాలన్నారు. డీఈవో మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో నాణ్యతను పెంపొందించేందుకు ప్రతీ ఉపాధ్యాయుడు బాధ్యతగా వ్యవహరించాలని, ఎంఈవోలు, జీహెచ్‌ఎంసీ పాఠశాల స్థాయి పర్యవేక్షణను మరింత బలపరచాలని సూచించారు.

## పురాతన భవనాల పరిశీలన



పేటలో శిథిలావస్థలో ఉన్న ఇళ్లను పరిశీలిస్తున్న మునిసిపల్ కమిషనర్, తహసీల్దార్, ఎస్ఐ

నారాయణపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట మునిసి పాలిటీ పరిధిలో ఉన్న శిథిలావస్థ పురాతన భవనాలను బుధవారం మునిసిపల్ కమిషనర్ నర్సయ్య, తహసీల్దార్ అమరేందర్‌కృష్ణ, ఎస్ఐ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ఆయా భవన యజమానులకు సూచనలు చేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల భవనాలు కూలిపోయే ప్రమాదముందని, సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. శిథిలావస్థ ఇళ్లల్లో ఉండి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దన్నారు. అలాగే, అద్దె భవనంలో కొనసాగుతున్న ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాల భవన సముదాయాన్ని వారు పరిశీలించారు. వార్డుల్లో కూడా వార్డు అధికారులు పురాతన, పాడుబడిన ఇళ్లను పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేయాలని కమిషనర్ నర్సయ్య ఆదేశించారు.

## కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి



మోమినాపూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సూచనలిస్తున్న ఎంపీడీవో శ్రీధర్

మద్దూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఎంపీడీవో శ్రీధర్ విద్యార్థులకు సూచించారు. బుధవారం మండలంలోని మోమినాపూర్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించడంతో పాటు, పాఠశాలలో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. అనంతరం పదో తరగతి విదార్థులకు ప్రశ్నలు వేసి వారి సామర్థ్యాన్ని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు చేశారు. హెచ్‌ఎం చెన్నకేశవులు, హరికృష్ణ, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి బాల్‌రాజ్ తదితరులున్నారు.

## బీసీలను పావులుగా వాడుకుంటున్నారు




సమావేశంలో మాట్లాడుతున్న ముదిరాజ్ రాష్ట్ర సమితి అధ్యక్షుడు దుర్గం సురేష్

మక్తల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): దేశంలో 70 కోట్లకు పైగా ఉన్న బీసీలను అన్ని రాజకీయ పార్టీలు పావులుగా వాడుకుంటున్నారని ముదిరాజ్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం సురేష్, బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులుగౌడ్ అన్నారు. బుధవారం పట్టణంలోని రాయల్ ఫంక్షన్‌హాల్‌లో అఖిలపక్షం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీసీ గర్జనకు వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. రాజ్యాంగం అమలులోకి వచ్చి 70 ఏళ్లు దాటినా రిజర్వేషన్ల సాధనలో బీసీలకు న్యాయం జరగలేదన్నారు. రాజకీయ పార్టీలు బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నారన్నారు. బీసీలను అణచివేసినంతగా ప్రపంచంలో ఏ జాతి అణచివేతకు గురికాలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి తక్షణమే ముఖ్యమంత్రి అఖిలపక్షాన్ని ప్రధాని వద్దకు తీసుకెళ్లాలన్నారు. తెలంగాణలో అన్ని పార్టీల ఎంపీలు రిజర్వేషన్లకు మద్దతు ప్రకటించాలన్నారు. బీసీ ఐక్య వేదిక రాష్ట్ర కార్యదర్శి తిమ్మప్ప, కోశాధికారి రంగప్పయాదవ్, వేణుకుమార్, భైరి శేఖర్, జుట్ల నరేందర్, ఆంజనేయులు, ఉజ్జెల్లి బస్వరాజ్, సూర్యచంద్ర పాల్గొన్నారు.

## అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలి




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాణికేశ్వరి మాతా ట్రస్ట్ సభ్యులు

నారాయణపేట న్యూటౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): భక్తుల గుండెల్లో గూడు కట్టుకున్నటువంటి మాణికేశ్వరి మాతా శివైక్యంపై నిరాధారమైన వ్యాఖ్యలు చేసిన నల్లగొండకు చెందిన ఈశ్వరమ్మ, రణధీర్‌లపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని స్థానిక మాతా ఆశ్రమం ట్రస్ట్ సభ్యులు ఏవీ.మందార్, బి.శివరాంరెడ్డి, వాల్వేకర్ నికేతన్, టి.సత్యనారాయణ, కె.శ్రీనివాస్‌లు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నల్గొండ జిల్లా కేంద్రంలోని గంధంగూడలో గల మాణికేశ్వరి మాత ఆశ్రమంలో ఈశ్వరమ్మ, రణధీర్ తదితరులు సోషల్ మీడియా వేదికగా ఆశ్రమానికి తానే పీఠాధిపతిని అనడమే కాకుండా అమ్మవారి శివైక్యంపై అనుచితంగా, యానగుంది శివయ్యస్వామితో పాటు మరికొందరిపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వాస్తవానికి అక్కడ భక్తులు ఏర్పాటు చేసిన కమిటీల ద్వారానే ఆశ్రమ నిర్మాణం కొనసాగుతోందన్నారు.

## అమరుల త్యాగం వెలకట్టలేనిది

నారాయణపేట న్యూటౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల త్యాగం వెలకట్టలేనిదని, వారి సేవలను స్మరించుకోవడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని ఎస్పీ డా.వినీత్ పేర్కొన్నారు. అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా 2005లో నక్సల్స్ కాల్పుల్లో వీరమరణం పొందిన రాజారెడ్డి కుటుంబాన్ని పరామర్శించి రావాలని ఆయన స్థానిక కానిస్టేబుల్‌ను హైదరాబాద్‌లోని చిక్కడపల్లిలో నివాసముంటున్న వారి ఇంటికి బుధవారం పంపించారు. రాజారెడ్డి కుటుంబ సభ్యుల యోగ క్షేమాలు, స్థితిగతులు తెలుసుకొని పోలీసు శాఖ అండగా ఉంటుందని ఎస్పీ సందేశాన్ని కానిస్టేబుల్ వివరించారు. కానిస్టేబుల్ లక్ష్మారెడ్డి, రాజారెడ్డి సతీమణి భాగ్యమ్మ, కుమారుడు అమర్నాథ్‌రెడ్డి ఉన్నారు.

## బాల్య వివాహాలపై అవగాహన

ఊట్కూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపొర్ల గ్రామంలో బుధవారం విజన్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ తరుపున జిల్లా గ్రామీణ బాలికల సంరక్షణ కమిటీ ఆధ్వర్యంలో బాల్య వివాహలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో సంస్థ కమ్యూనిటీ సోషల్ మొబిలైజర్(సీఎస్ఎం) స్వప్న మాట్లాడుతూ బాల్యవివాహాలు చేయడం వల్ల బాలికల ఎదుగుదల నిలిచిపోవడంతో పాటు ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని అన్నారు. చిన్న వయస్సులో పెళ్లి చేయడం చట్టరీత్యా నేరమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించి మంచి ప్రయోజకులుగా చేయాలని కోరారు. సదస్సులో పంచాయతీ కార్యదర్శి శివశంకర్, పాఠశాల హెచ్‌ఎం నర్సింగప్ప, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.